ప్రజాశక్తి
శనివారం 23 నవంబర్ 2024
8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



ఎగ్జిబిషన్లో స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి ఎస్.సవిత, ఎంఎల్ఎ గద్దె

# హస్తకళలు, చేనేతకు పూర్వ వైభవం

- మంత్రి ఎస్.సవిత

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** హస్తకళలు, కళాకారులకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం విశేష కషి చేస్తోందని.. త్వరలో విదేశాల్లోనూ ఎగ్జిబిషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర చేనేత, బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. శుక్రవారం విజయవాడ, పటమటలోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో లేపాక్షి గాంధీ శిల్ప బజార్‌ను మంత్రి సవిత.. విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, ఏపీ హస్తకళల అభివద్ధి కార్పొరేషన్ (ఏపీ హెచ్‌డీసీ) లిమిటెడ్ వీసీ, ఎండీ ఎం.విశ్వ, విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య తదితరులతో కలిసి ప్రారంభించారు. శుక్రవారం నుంచి డిసెంబర్ 1వరకు హస్తకళాభిమానులను అలరించేందుకు దాదాపు 100 స్టాళ్లతో ఏర్పాటుచేసిన గాంధీ శిల్ప బజార్ ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు కళానైపుణ్యంతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శన, అమ్మకాలకు అందుబాటులో ఉంచగా.. వాటిని మంత్రి సవిత.. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి తిలకించారు. ఎంబ్రాయిడరీ, గ్రాస్ లీఫ్, ఇమిటేషన్ జువెలరీ, కార్పెట్స్, లెదర్ ఆర్టికల్స్, హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్, టై అండ్

(మిగతా 2లో)

# అదాని ఆర్థిక నేరాలపై నిరసనాగ్రహం





అదానీకి జైలు ఫ్లెక్సీతో వినూత్న నిరసన

- విజయవాడ, మచిలీపట్నంలో సిపిఎం ధర్నా
- ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్





అదానీకి సంకెళ్లతో వినూత్న నిరసన

**ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) :** అదానీ ఆర్థిక కుంభకోణాలపై ప్రజలు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. తప్పుడు పద్ధతిలో ఆర్థిక వ్యవహారాలు సాగించిన అదానీని వెంటనే అరెస్టు చేయాలనే నినాదాలు హోరెత్తాయి. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్‌తో ప్రజలు రోడ్డెక్కారు. కుంభకోణాల అదానీని వెంటనే అరెస్టు చేయాలని, అదానీ అవినీతికి, మోడీ ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగి ఒప్పందాలు చేసుకున్న గత వైసిపి ప్రభుత్వ విధానాలపై న్యాయ విచారణ జరిపి శిక్షించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఆపాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాలను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రద్దుచేసి చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని కోరుతూ విజయవాడ బీసెంట్ రోడ్, మచిలీపట్నం కోనేరు సెంటర్లలో ధర్నాలు నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యాన జరిగిన ఈ ధర్నాల్లో ప్రజలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. విజయవాడలో అదానీ ఫొటోలతో ఉన్న మాస్కులను ముఖాలకు పెట్టుకుని అతని ఆర్థిక నేరాలకు శిక్షపడినట్లు ఆయన చిత్రపటాన్ని కటకటాల్లో ఉంచి, సంకెళ్లు వేసి ఉన్న ఫ్లెక్సీలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ అంతర్జాతీయ ఆర్థిక నేరస్తుడిని అరెస్టు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. మచిలీపట్నం కోనేరు సెంటర్లో సిపిఎం జెండాలు, అదానీ మోసాలపై వేసిన బ్యానర్‌ను చేతబట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అదానీ అవినీతి మరోసారి బట్టబయలైందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కుంభకోణాలు వెలుగులోకి

(మిగతా 2లో)



# ఇసుక దోపిడీ

- పలువురికి కాసుల వర్షం
- 20 టన్నులకు నగదు... రవాణా చేసేది 40 టన్నులు

**ప్రజాశక్తి - కంచికచర్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఇసుక విధానం పలువురికి కాసుల వర్షం కురిపిస్తోంది. “నూతన ఇసుక విధానం పారదర్శకంగా జరగాలి, అధికారం ఉందికదాని ఎవరైనా ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడిచి, అడ్డగోలుగా అక్రమ రవాణా చేస్తే ఎంతటివారైనా సరే వారి తోక కట్ చేస్తా” అని సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబు స్వయంగా హెచ్చరించినా ఫలితం ఉండడంలేదు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. ఈ విషయాన్ని అధికార పార్టీ కార్యకర్తలే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఉచిత ఇసుక విధానంలో అక్రమాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో ఎంఎల్‌ఎలే పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అయితే నందిగామ నియోజకవర్గంలో అధికారిక క్వారీల్లో ఎక్కడా ఇసుక రవాణాలో అక్రమాలకు తావులేకుండా చూడాలని స్థానిక ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య గుత్తేదారులకు సూచించారు. అయినా సాక్షాత్తూ ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్‌ఎల ఆదేశాలను ధిక్కరించి అధికార పార్టీకి చెందిన జిల్లా స్థాయి నాయకుల మద్దతుతో నందిగామలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోందని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. ఇందుకు చందర్లపాడు మండలం కాసరబాద ఇసుక క్వారీలో జరుగుతున్న దోపిడీ తంతే నిదర్శనమని పలువురు చెబుతున్నారు. వారం రోజులుగా కాసరబాద క్వారీలో లోడింగ్ ప్రక్రియ మొదలైంది. వాస్తవానికి ఒక్కో లారీకి 20 టన్నులు లోడ్ చేసి టన్నుకు రూ.140 చొప్పున రూ.2800 ఆన్‌లైన్లో నగదు కట్టి చలానా తెచ్చుకున్న వారి లారీకి లోడ్ చేయాలి. ఇక్కడ జరుగుతున్నదేమిటంటే చలానా ఆన్‌లైన్లో రూ.2800 చెల్లించిన వాహనాలకు 20 టన్నులకు బదులు 40 టన్నులు లోడ్ చేసి అదనంగా మరో రూ.7,500లను క్వారీలో ఉన్న సిబ్బంది వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే కొన్ని వాహనాలకు ఎలాంటి చలానా లేకపోయినా ఉచితంగానే 40 టన్నుల ఇసుక లౌడ్ చేస్తున్నట్లు సమాచారం. ఇలా ప్రతిరోజు ఇసుక దోపిడీ జరుగుతున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అదనంగా వసూలు చేసిన నగదులో ఎవరివాటా ఎంత అని పలువురు చర్చించుకుంటున్నారు. అలాగే ప్రతిరోజూ పగలు రాత్రి తేడా లేకుండా ఎలాంటి నగదు చెల్లించకుండా ఓవర్ లోడ్‌తో ఇసుక రవాణా చేసే లారీలు ఎవరివని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలా దోపిడీ చేసిన ఇసుక విజయవాడ, గుంటూరుతోపాటు హైదరాబాద్‌కు తరలిపోతున్నట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఇటీవల కొన్నిరోజులు హడావుడి చేసిన ఆయా శాఖల అధికారులు ప్రస్తుతం స్తబ్దతగా

(మిగతా 2లో)

ఎలాంటి అనుమతులు లేకుండా ఓవర్ లోడుతో వెల్తున్న ఇసుక లారీలు








20 టన్నుల రశీదుతో 40 టన్నుల ఓవర్ లోడ్ లారీ

20 టన్నులకు రశీదు



AP SAND MANAGEMENT SYSTEM
Consumer Copy

| | |
|---|---|
| Order Id | C100045173-01 |
| Trip No | 3 |
| Customer Name | BIGUMALLA BHANU SUPRIYA |
| Customer Mobile No | 7989682584.0 |
| Sand Quantity: | 20.0Tons |
| Sand Supply Point Name | KASARABADA |
| Dispatch Date | 22-11-2024 09:24:15 AM |
| Driver Name | venkatesh |
| Driver Mobile No | 9030218347 |
| Vehicle No | AP39UX4554 |

ress: NTR,Vijayawada (Rural),Ambapuram,05-Sun napu battilu- Christhurajupuram,

# దీపం-2 కింద 50 లక్షల మందికి లబ్ధి

- మంత్రి నాదెండ్ల మనోహర్

**ప్రజాశక్తి - విజయవాడ :** కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందిన వారి సంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కష్ణలంకలోని కోత మిషన్ రోడ్డు ప్రాంతంలో శుక్రవారం జరిగిన దీపం-2 ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, పౌర సరఫరాల కార్పొరేషన్ వీసీ, ఎండీ జి.వీరపాండ్యన్, జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా, విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య తదితరులు పాల్గొని లబ్ధిదారు ఎం.కోటేశ్వరమ్మ కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. గ్యాస్ స్టవ్‌పై టీ కాసి తాగారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటీ 55 లక్షల 200 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉంటే దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందొచ్చన్నారు. అయితే కొందరు దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని, గ్యాస్ కనెక్షన్ల సంఖ్యపై కూడా అవగాహన లేకుండా కోటీ 85 లక్షలు అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకం అందేలా రూ.894 కోట్ల అడ్వాన్సును గ్యాస్ కంపెనీలకు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు దీనిపై కేవలం 521 ఫిర్యాదులు మాత్రమే అందాయన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఇంటిలో సంతోషం నింపాలని, 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాలో నిధులు జమవుతున్నాయని వివరించారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ దీపం పథకం ద్వారా 21 రోజుల్లోనే 50 లక్షల మంది లబ్ధిపొందడం చాలా ఆనందం కలిగిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్‌వో ఎ.పాపారావు, తహశీల్దార్ ఎం.వెంకట రామయ్య, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఉచిత గ్యాస్ పంపిణీలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎల్ఎ గద్దె

## 26న తిరువూరు కళాశాలలో జాబ్ మేళా

**ప్రజాశక్తి - తిరువూరు :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 26వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుశీలరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సీడాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాను జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు నిర్వహిస్తారని తెలిపారు. మొత్తం 200 మందికి ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. యాక్సిస్ బ్యాంక్, మేడ్ ప్లస్, సుధీర్ టింబర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు హాజరై అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని పేర్కొన్నారు. యాక్సిస్ బ్యాంకులో 80 ఖాళీలను భర్తీ చేస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.18 వేల నుంచి రూ.20వేల వరకు జీతం చెల్లిస్తారని తెలిపారు. మెడ్ ప్లస్లో 100 ఖాళీలను భర్తీ చేస్తారని, ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ.20వేల వరకు జీతం చెల్లిస్తారని తెలిపారు. సుధీర్ టింబర్ డిపోలో 20 ఖాళీలను భర్తీ చేస్తారని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం చెల్లిస్తారని తెలిపారు. యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగాల కోసం ఏదైనా డిగ్రీ అర్హత ఉన్నవారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మెడ్ ప్లస్‌లో అయితే టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎం ఫార్మసీ, బి ఫార్మసీ, డి ఫార్మసీ చదివినవారు అర్హులని తెలిపారు. సుధీర్ టింబర్ డిపోలో ఏదైనా డిగ్రీ కలిగి ఉన్నవారు జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగినవారై ఉండాలని, అర్హత, ఆసక్తి కలిగిన వారు హాజరు కావచ్చని వివరించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - విజయవాడ :** శనివారం ఉదయం 7 నుండి 10 గంటల వరకు గవర్నరుపేట సెక్షన్ గవర్నరుపేట విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ అరండల్ పేట ఫీడర్, 11 కేవీ అన్నదాన సమాజం రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు, మెయింటినెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిసిపిడిసిఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రెహమాన్ వీధి, కోదండరామిరెడ్డి వీధి,వెంకటేశ్వరరావు వీధి, రామ్ మందిరం వీధి,శేషాద్రి శాస్త్రి వీధి,హుస్సేన్ సాహెబ్ వీధి, జానీ వీధి, యాసిన్ వీధి, గోగవారి వీధి, చింతా వారి వీధి, దాసు వారి వీధి, మసీదు వీధి, జలీల్ వీధి,దుర్గయ్య వీధి, మొహిద్దీన్ వీధి,అన్నదాన సమాజం రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు.



## గ్రీవెన్స్ సమస్యలను వెంటనే పరిష్కరించండి

### సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశం

**ప్రజాశక్తి - విజయవాడ :** గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎపి సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. వచ్చిన సమస్యలను అధికారులు ఆరోజే పరిష్కరించాలన్నారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు విశేషంగా పాల్గొని తమ సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ఏపీ సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అదనపు కమిషనర్ వారికి వచ్చిన సమస్యలలో అధిక శాతం అక్కడికక్కడే పరిపాలష్కార మార్గం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అమరావతిలో భూమి వ్యవహారాలపై 61, ప్రణాళికా విభాగం 2, అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ 1, డెవలప్మెంట్ ప్రమోషన్స్ 5 ఫిర్యాదు అందాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి.రామకష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రేపు యువ ఉత్సవ్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** నగరంలోని విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ వుమెన్ కళాశాలలో యువ ఉత్సవ్ 2024 ఆదివారం జరుగుతుందని నెహ్రూ యువ కేంద్రం ఎన్టీఆర్ జిల్లా యువ అధికారి సుంకర రాము తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జ రిగే ఈ ఉత్సవ్‌లో పంచ ప్రాణ్ అమత్ కాల్ గోల్ ఆఫ్ డెవల్పెడ్ ఇండియా ఏట్ 2047 అనే థీమ్ అంశంపై పెయింటింగ్, కవితవ్యం, మొబైల్, ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్, విభాగాలలో వ్యక్తిగత పోటీలు, కల్చరల్ ట్రెడిషనల్, ఫోక్ (గ్రూప్), సైన్స్ ఎకిబిషన్ మేళా పోటీలలో గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయని తెలిపారు. యువ ఉత్సవ్ లో తమ పేర్లు నమోదు చేసుకోవడానికి https://forms.gle/Eh5AqWBdzVFjQ6Br7 లింక్‌ను ఉపయోగించు కోవాలన్నారు. ఇతర వివరాలకు 9966357021 మొబైల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

## 4న ఎఐ టెక్నాలజీ డిజిటల్ మార్కెటింగ్‌పై వర్క్‌షాప్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** వ్యాపార రంగంలో ఏ ఐ టూల్ ని ఉపయోగించి విన్నూతనంగా డిజిటల్ మార్కెటింగ్ చేయటం ద్వారా తమ వ్యాపారాలను అభివద్ధి చేసుకొనేలా ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో డిసెంబర్ 4 న సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ రీజియన్ అధ్యక్షుడు మలినేని రాజయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ హోటల్ వివంత లో జరిగే ఈ సదస్సులో చిన్న, మధ్య తరగతి వ్యాపారులు, పరిశ్రమలు నిర్వహించే ఔత్సాహిక వ్యాపారులు, గహాలలో కుటీర పరిశ్రమ నిర్వాహకులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ వర్క్ షాప్ లో పాల్గునే వారు ఎలాంటి ఫీజులు చెల్లించాలిన అవసరం లేదని, ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ నెల 30 లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు, వివరాలకు 9848077227 లేదా andhrachambervijayawada@gmail.comలో సంప్రదించాలని సూచించారు.

## మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

**ప్రజాశక్తి - విజయవాడ :** మోటార్ సైకిల్ దొంగతనం కేసుల్లో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుండి రూ.1.5 లక్షల విలువైన మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మోటారు సైకిళ్ల దొంగతనం కేసుల్లో నిందితుడైన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదాల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేష్‌ను శనివారం విజయవాడ ఆటోనగర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు మోటార్ సైకిళ్లను దొంగతనం చేసినట్లుగా కేసు నమోదైంది.





## మొదటిపేజీ తరువాయి

## ఇసుక దోపిడీ

ఉంటున్నారు. దీంతో అధికారం ముసుగులో కొందరు ఇసుకను లూటీ చేస్తూ జేబులు నింపుకుంటున్నారని తెలుగు తమ్ముళ్లే ఆరోపిస్తున్నారు. నందిగామ ప్రాంతంలో ఎక్కడా ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు జరగటంలేదని, చట్టాలు తయారుచేసిన వారే అధికారం ముసుగులో దానిని అతిక్రమించి యధేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఇసుక ఓవర్ లోడ్ లారీలతో గ్రామీణ రోడ్లు ధ్వంసం**

నందిగామ నియోకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా 40 టన్నుల ఇసుక ఓవర్ లోడ్ లారీలతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవర్ లోడ్ ఇసుక లారీల వల్ల రోడ్లు కొద్దిరోజులకే ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని చెబుతున్నారు.

## హస్తకళలు, చేనేతకు పూర్వ వైభవం

డై చీరలు, ఉడ్ కార్వింగ్, లేస్ బ్యాగులు, డ్రెస్ మెటీరియల్స్, కొండపల్లి బొమ్మలు తదితరాలతో ఏర్పాటు చేసిన స్టాళ్ల ఏర్పాటుదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి దిశానిర్దేశం మేరకు మన సంస్కతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎన్‌డీయే ప్రభుత్వం విశేష కషిచేస్తోందని.. మరుగునపడిన కళలకు జీవం పోస్తోందని పేర్కొన్నారు. హస్తకళలను, చేనేతను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. చేయిచేయి కలిపి స్వర్ణాంధ్ర ఏ 2047 సాధనకు కలిసికట్టుగా కషిచేద్దామని పిలుపునిచ్చారు. అయిదు నెలల కాలంలోనే మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో మూడు ప్రదర్శనలను ఏర్పాటు చేశామని.. రాష్ట్రంలో లేపాక్షి, ఆప్కో, చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయని వివరించారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో త్వరలో లేపాక్షి ఎంపోరియంను ఏర్పాటు చేస్తామని.. అదే విధంగా తిరుపతి, విశాఖ తదితర ప్రాంతాల్లోని ఎంపోరియంలను ఆధునికీకరిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలనేది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని.. ఎంఎస్ఎంఈల అభివద్ధికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఉడ్ కార్వింగ్ వస్తువులు, కొండపల్లి బొమ్మలు వంటి కళాత్మక వస్తువులతో పాటు తోలుబొమ్మలాట వంటి ప్రదర్శనలు గాంధీ శిల్ప బజార్‌లో ఎంతో ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. ఏపీ హస్తకళల అభివద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎం.విశ్వ మాట్లాడుతూ హస్తకళాత్మక వస్తువులను ప్రోత్సహించే లక్ష్యంతో గాంధీ శిల్ప బజార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో ఎండీ ఆర్.పవనమూర్తి, చేనేత, జౌళి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అదాని ఆర్థిక నేరాలపై నిరసనాగ్రహం

వస్తున్నాయని, అరెస్టు వారెంట్లు కూడా జారీ అవుతున్నాయని చెప్పారు. మోడీ, బిజెపి ప్రభుత్వ అండతో అదానీ దేశాన్ని కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్, సిమెంట్ తదితర అనేక రంగాలను కబళించారని, సహజ వనరుల సంపదను దోచేశారని విమర్శించారు. భూములు, బొగ్గు, సూర్య రశ్మీ నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఒప్పందాల ద్వారా లక్షల కోట్లు దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా మోడీ, జగన్ ప్రభుత్వాలు కుదుర్చుకున్న అవినీతి ఒప్పందాలను కొనసాగించడం శోచనీయమన్నారు. పైపెచ్చు అదానీ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టును కొనసాగిస్తూ వాటిని శరవేగంగా ఏర్పాటు చేస్తోందని విమర్శించారు. డేటా సెంటర్, విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాలను కూటమి ప్రభుత్వం కట్టబెడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అదానీతో గ్రీన్ ఎనర్జీ పేరుతో ఒప్పందాలను కొనసాగిస్తోందన్నారు. సిపిఎం తొలి నుండీ సోలార్ విద్యుత్ ఒప్పందాల బండారాన్ని పలుసార్లు నియంత్రణ మండలి ముందు లేవనెత్తిందని, వైసిపి ప్రభుత్వ అడ్డగోలు ఒప్పందాలపై నిలదీసి పోరాడిందని గుర్తుచేశారు. అదాని స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంట్లో, ప్రతి సంస్థలో అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగిన ధర్నాలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోయి సత్యబాబు, కోట కళ్యాణ్, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణ రావు, కె.దుర్గారావు, స్థానిక నాయకులు వై.సుబ్బారావు, కాజా గురుమూర్తి, మురళి తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నంలో జరిగిన ధర్నాలో సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, కృష్ణాజిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్. జయరావు, పార్టీ నగర నాయకులు టి.చంద్రపాల్, ఎమ్‌డి.యూనస్, కెవిపిఎస్ నగర అధ్యక్షులు ఎంఎ బెనర్జీ, నాయకులు బి.సత్యనారాయణ, ఈడే రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టి

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)** : జిల్లాలో ఎస్‌సిలు అధికంగా నివసించే ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన అమలుపై ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి మండలాల వారీగా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద తొలి దశలో 2018-19 నుండి 2020-21 సంవత్సరాలకు 38 గ్రామాలను, రెండవ దశలో 2022-23 సంవత్సరానికి 40 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేశామన్నారు. మొదటి విడతలోని గ్రామాల అభివద్ధికి 6.24 కోట్ల రూపాయలను విడుదల చేశామన్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు అధికంగా నివసించే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివద్ధి పరచడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. నిధులు మంజూరు చేసినప్పటికీ మూడు సంవత్సరాలుగా పనులు చేపట్టక, ఖర్చు చేయకపోవడం పట్ల అసంతప్తి వ్యక్తం చేస్తూ అలా చేస్తే నిధులు మురిగిపోయే అవకాశం ఉందని స్పష్టం చేస్తూ వెంటనే సవరించిన అంచనాలు అందజేసి పరిపాలన ఆమోదం పొందాలని సూచించారు. ఈ నిధులను ముఖ్యంగా సిసి రహదారులు, మురికి కాలువలు నిర్మాణంతో పాటు మంచినీరు పారిశుధ్య మౌలిక సదుపాయాలు, నిధులు లేక అర్థాంతరంగా నిలిచిపోయిన పాఠశాలలు, అంగన్వాడి భవనాలలో మరుగుదొడ్లు, అంగన్వాడీ భవనాలు నిర్మాణం, సౌర విద్యుత్ దీపాలు వంటి సదుపాయాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, జడ్పీ సీఈవో కే కన్నమ నాయుడు, డ్వామా పిడి శివప్రసాద్ యాదవ్, డిపిఓ అరుణ,జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డిఎల్పివోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## పోలీసుశాఖ ప్రతిష్ఠ పెరిగేలా సాయుధ బలగాలు పనిచేయాలి : ఎస్‌పి



**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)** : వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తూ పోలీసుశాఖ ప్రతిష్ఠ మరింత పెరిగేలా సాయుధ బలగాలు పని చేయాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధ రరావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖలోని ఆర్మడ్ రిజర్వ్, హెూంగార్డ్స్ సిబ్బందికి, శుక్రవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన పెరేడ్ కు జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఆర్ఐ సతీష్ కుమార్ పెరేడ్ కమాండర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెరేడ్ అనేది పోలీస్ కల్చర్ లో అంతర్భాగమని, పెరేడ్, స్పోర్ట్స్ మీట్ ల ద్వారా సిబ్బందిలో టీమ్ వర్క్ ను, క్రమశిక్షణను, ఐక్యమత్యాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో దోహదపడతా యన్నారు. బందోబస్త్, ఎస్కార్ట్ విధులు పట్ల చాల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ , ఏఆర్‌డిఎస్‌పి వెంకటేశ్వరరావు, ఆర్ ఐ లు,ఆర్ ఎస్ ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.




స్టేషన్ వద్ద సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి గంగాధరరావు

## కోడూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

**ప్రజాశక్తి-కోడూరు** : కోడూరు ప్రధాన కూడలిలో ఉన్న సీసీ కెమెరాలు పునరుద్ధరించాలని, స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసులు లేకుండా దర్యాప్తు చేపట్టాలని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోడూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను, స్టేషన్ రికార్డులను ఎస్పీ పరిశీలించారు. అవనిగడ్డ డి.ఎస్.పి మురళీధర్, సిఐ యువకుమార్, కోడూరు ఎస్సై చాణిక్య స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్‌మీటర్లతో అదనపు భారం : సిపిఎం

**ప్రజాశక్తి - గుడివాడ** : స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందని దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో ప్రీపెయిడ్ విద్యుత్తు స్మార్ట్ మీటర్లని బిగిస్తున్నారన్నారు. 13 వేల రూపాయలు ఉండే స్మార్ట్ మీటరును 30 వేల రూపాయలు వరకు కట్టి 92 నెలలు ఈ స్మార్ట్‌మీటర్ రేటు కూడా మన దగ్గర నుంచే వసూలు చేస్తున్నారన్నారు. ఈ స్మార్ట్ మీటర్ల వల్ల రాబోయే రోజుల్లో విద్యుత్తు చార్జీలు పెరగడం,విద్యుత్తును మనం వినియోగించక ముందే డబ్బులు పెట్టి కరెంటు కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు ఆర్ కొండ, ఆలూరు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై మినుము విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి-ఘంటసాల** : ఘంటసాల రైతు సేవా కేంద్రం నందు 30 శాతం రాయితీపై మినుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అందించే నాణ్యమైన విత్తనాల ద్వారా మంచి దిగుబడులు సాధించాలని తెలియజేశారు. మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకష్ణ మాట్లాడుతూ మినుములు పూర్తి ధర రూ.140లకు గానూ 30 శాతం రాయితీ పోనూ ఒక కేజీ రూ.98ల చొప్పున ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు అందజేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలను సమర్పించాలని తెలిపారు. ఘంటసాల మండలంకు 195 క్వింటాళ్లు మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, బండి పరాత్పరరావు, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ముమ్మరంగా వరికోతలు

**ప్రజాశక్తి - గన్నవరం** : మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగా సాగు చేసిన వరి కోతకు వస్తోంది. ఆలస్యంగా వేసిన చేలు ఇంకో 20 రోజులకు కోతకు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఈసారి నీరు అందుబాటులో ఉండటంతో పాటు తెగుళ్లతాకిడి తక్కువగా ఉండటంతో వరి బాగా పండిందని తెలిపారు. ఎకరాకు 30 నుంచి రూ.40 దాకా పంట దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. రైతులు ఎంటియు 1061, బివిటీ 5204 వరి వంగడాలు సాగు చేశారు. వర్షాలు సంవద్ధిగా వడ్డాయి. మరో వైపు ఏలూరు కాలువ, పోలవరం కాలువ నీరు పొలాలకు పూర్తిగా అందింది. వరద కారణంగా కొన్ని గ్రామాల్లో పంట దెబ్బతింది. అయితే పంటలకు నీటి సమస్య లేకుండా పోయింది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 17 వేల హెక్టార్లలో వరి సాగయింది. ఏలూరు కాలువ కింద ఏడు పంచాయతీలోనూ, మెట్టగ్రామాల్లోని చెరువులు కింద వేస్తారు. కొండపావులూరు, గోపవరపు గూడెం, పురుషోత్తపట్నం, చిన ఆవుటపల్లి గ్రామాల్లో మెట్ట పైర్లు వేశారు. విద్యుత్ మోటార్ల కింద సాగు జరిగింది. తెంపల్లి, మెట్లపల్లి, మర్లపాలెం, వీరవనేనిగూడెం ఏరియాల్లో బోర్ల కింద వరి వేశారు. నెలలో మూడు నుంచి నాలుగుసార్లు వానలు వడటంతో నీటి సమస్యత లెత్తలేదు. తెగుళ్ల కూడా పెద్దగా ఆశించలేదు. వాతావరణం కలిసిరావడంతో రైతుల పెట్టుబడి కూడా తగ్గింది. ఈసారి ఎకరాకు రూ.16 నుంచి రూ.18 వేల లోపు పెట్టుబడి అయ్యిందని రైతులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో యంత్రం ద్వారా కోతలు ముగించి ధాన్యాన్ని ఎండలో ఆరబెడుతున్నారు.



వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

## చేపల వ్యర్థాలతో ఇబ్బందులు

**ప్రజాశక్తి-చల్లపల్లి** : మండల పరిధిలోని నడకుదురు కరకట్ట సమీపంలో నివాస గహాల మధ్య వ్యాపారం చేస్తున్న చేపల వ్యాపారులు చేపల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ఈ ప్రాంతంలోని చేపల వ్యాపారులు ప్రతిరోజు పెద్ద సంఖ్యలో మత్స్య ఉత్పత్తులు విక్రయిస్తుంటారు. చేపలు, రొయ్యలు, పీతలు కొనుగోలు చేసే వినియోగదారులకు వాటిని శుభ్రం చేసి విక్రయిస్తూ ఉంటారు. తద్వారా మిగిలే చేపలు పీతలు రొయ్యల వ్యర్థాలను ప్రతినిత్యం కరకట్ట సమీపంలోని కేఈబీ కెనాల్ ప్రధాన పంట కాలవలో పోయటం వలన నీరు కాలుష్యం అవుతుంది. కెఇబి కాలువ దిగువ గ్రామాల ప్రజలు తాగు నీరుగా వాడు కుంటున్నారు. ఈ నీరు తాగటం వలన అంటరోగాలు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్ణానది పరిసరాలలో వ్యర్థ పదార్థాలు పోస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధభరితంగా మారుతోంది. ఈ దుర్వాసనతో స్థానికులు తీవ్ర అనారోగ్యాలకు, అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఈ కరకట్ట వెంట, రహదారి వెంట నిత్యం రాకపోకలు సాగించే వందలాదిమంది ప్రయాణికులకు వాహనదారులకు స్థానికులకు ఈ చేపల వ్యర్థాల కారణంగా ఏర్పడుతున్న కాలుష్యభరితమైన తీవ్ర దుర్వాసన తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై జిల్లా పంచాయతీ అధికారులకు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నారు.

## రేపు ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)** : విబో హాస్పిటల్స్ విజయవాడ వారి ఆద్వర్యంలో ఈ నెల 24 తేదీన మచిలీపట్నం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ టి. విశ్వనాథ్ తెలిపారు.ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపులో బోధకాలు, థైరాయిడ్, మొలలు, పులిపిర్లు, సోరియాసిస్, ఎర్నియా పాత గాయాల వలన ఏర్పడిన మచ్చలు, సాగిన చెవి రంధ్రాలు, తెగిన చేతి లేదా కాలి వేళ్ళను తిరిగి అమర్చుట, గోరుచుట్టు, కొవ్వు గడ్డలు, చర్మ సౌందర్యం, ముఖ సౌందర్యం, మానని గాయాలు, అధిక బరువు, బట్టతల మరియు జుట్టుకు సంబంధించిన సమస్యలు వంటి వివిధ సమస్యలతో బాధపడే వారికి ఉచిత వైద్య సలహాలు అందించి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, టిడిపి కష్ణా జిల్లా ప్రచార కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్, , బత్తిన అగస్త్తేశ్వర రావు,విబో హాస్పిటల్ సిబ్బంది, బి. వెంకట్రావు, ఎస్ శివరాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

## భవిత కేంద్రానికి ఆట వస్తువులు అందజేత

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలోని భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి వారు ఆట వస్తువులు, ఇతర ఉపకరణాలు అందజేశారు. శుక్రవారం సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకొని సేవా సమితి నిర్వాహకులు సనక నాగమణి ఈశ్వరరావు, మానేపల్లి ఋషులు ఈ ఉపకరణాలు ఎంఈఓ ఎన్ శివశంకర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రతి ఏటా భవిత కేంద్రానికి సత్యసాయి సేవా సమితి ద్వారా సహాయం అందిస్తున్నామని, సేవా సమితి నిర్వాహకులు నాగ మునేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర ఐఆర్‌టీలు నాగదుర్గ నాగమణిలు పాల్గొని శిక్షణ పొందుతున్న చిన్నారుల సామర్థ్యాల మెరుగుదల గురించి వివరించారు.

## పాఠశాలల పనివేళలు యథావిధిగా నిర్వహించాలి

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)** : పాఠశాలలో పనిగంటల యథావిధిగా నిర్వహించాలని యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయి మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యవస్థాపక అధ్యక్షుడు, హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి శుక్రవారం ముఖ్యమంత్రి నార చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పాఠశాలలోని పనివేళలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పెట్టడం వలన రాష్ట్రంలోని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతారన్నారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రెండు, మూడు కిలోమీటర్ల దూరం నుండి పాఠశాలకు వస్తారని కావున వారికి తీవ్ర మానసిక వేదన, శారీరకంగా, భౌద్ధికంగా అలసిపోతారని అన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలోని పనివేళలు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు యథావిధిగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

# వెలగలేరులో పారిశుధ్యం అధ్వానం





**ప్రజాశక్తి-జి.కొండూరు:** మండలంలోని వెలగలేరు గ్రామంలో స్థానిక ఎస్సీ కాలనీ ఏరియాలో పారిశుధ్యం లోపించింది. దోమల మందు బ్లీచింగ్ పిచికారి చేసే నాధుడే కరువయ్యారు. దీనికి తోడు ఇటీవల గ్రామంలో పంచాయతీ నీళ్లు రాకపోవడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెబుతున్నారు. తమ సమస్య ఎన్నిసార్లు అధికారులు దష్టికి తీసుకెళ్లిన పరిష్కారం అవడం లేదని అంటున్నారు స్థానికులు. మురుగునీరు ప్రవహించేందుకు కనీసం కాలువలు లేని పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. ఎస్సీ కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్న అక్కడ శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేకపోయాయి ప్రభుత్వాలు. ప్రభుత్వాలు మారుతున్న తమ సమస్య లు మాత్రం పరిష్కారం అవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాలనీవాసులు. ఉన్న అరకొర మురిగు కాలువలలు పిచ్చి మొక్కలతో నిండిపోయయి. మురుగునీరు ప్రవాహం లేక ఒకే చోట నిల్వ ఉండటం వలన దోమల బెడద కూడా ఎక్కువగా ఉందని కాలనీవాసులు అంటున్నారు. గతంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మించేందుకు ఎమ్మెల్యే వసంత కష్ణ ప్రసాద్ రూ.80 లక్షలతో పనులు మొదలు పెట్టేందుకు శంకుస్థాపన కూడా చేశారని, అనివార్య కారణాలతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని ఆ నిధులు కూడా తరలిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. కనీసం ఈ ప్రభుత్వంలోనైనా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# పన్నుల వసూళ్లలో అలసత్వం వద్దు




**ప్రజాశక్తి-తిరువూరు:** మున్సిపాలిటీలకు రావాల్సిన సాధారణ నిధి వసూ ళ్లలో అలసత్వంగా వ్యవరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.నాగ నరసింహారావు అధికారులను, సిబ్బందిని హెచ్చ రించారు. తిరువూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, కొండపల్లి మున్సిపాలిటీల కమిషనర్లకు, మేనేజర్లకు, రెవెన్యూ, వార్డు సచివాలయం సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సి పాలిటీలు వారిగా పన్నుల బకాయిలు ఎంతెంత ఉన్నా యి, వాటి వసూళ్ళకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ఆర్ జెడి కమీషనర్లను మేనేజర్లను అడిగి తెలుసుకు న్నారు. ప్రతి సంవత్సరం పన్నులను సక్రమంగా వసూ లు చేయాలని తెలిపారు. తిరువూరు నగర పంచాయతీలో పన్నుల వసూళ్లు తక్కువ ఉన్నందున ప్రాపర్టీ, వాటర్ టాక్స్, ఖాళీ స్థలం పన్నులను వంద శాతం వసూ లు చేయాలని రెవెన్యూ సిబ్బందిని సచివా లయం అడ్మి న్లను ఆదేశించారు. ఈ సమావేశంలో తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, నందిగామ నగర పంచాయతీ కమిషనర్ ఐవి రమణ, జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌రావు, కొండపల్లి నగర పంచాయతీ కమిషనర్ పి శ్రీనివా సరావు తదిత రులు పాల్గొన్నారు.

## 'ప్రతిజ్ఞ' రచయితను గుర్తించాలి

**ప్రజాశక్తి-తిరువూరు**

ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును దేశంలోని అన్ని రాష్ట్రాల పాఠ్యపుస్తకాలలో ముద్రించాలని ప్రతిజ్ఞ ప్రచారకర్త ఎం.రాంప్రదీప్ నేషనల్ బుక్ ట్రస్ట్ (ఢిల్లీ )సౌత్ ఇండియా సమన్వయకర్త పి.మోహన్‌ను కోరారు. విద్యార్థులలో దేశభక్తి, సోదర భావం పెంపొందించే దుకు పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన భారత దేశం నా మాతభూమి ప్రతిజ్ఞ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పాఠ్య పుస్తకాలలో ఉన్నప్పటికీ, ఆయన పేరు మాత్రం తెలుగు రాష్ట్రాల పాఠ్య పుస్తకాలలో మాత్రమే ముద్రించబడుతుందని రాంప్రదీప్ అయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి పేరును దేశం లోని అన్ని రాష్ట్రాల విద్యార్థులకు తెలియాలంటే తప్ప నిసరిగా పాఠ్య పుస్తకాలలో ముద్రించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆహార భద్రతలో ఆక్వాకల్చర్‌కు ప్రాముఖ్యత

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** ఆహార భద్రతలో ఆక్వాకల్చర్ యొక్క పాత్రను గుర్తించాల్సి ఉందని ది వాటర్ బేస్ లిమిటెడ్ అధ్యక్షులు రమాకాంత్ ఆకుల తెలిపారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా నగరంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాదారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీవనోపాధి, ఆహార సరఫరా, ఆ పర్యావరణ సుస్థిరత్వానికి సమర్థవంతంగా మద్దతు ఇస్తున్న ఆక్వాకల్చర్ యొక్క ప్రాముఖ్యతను పునరుద్ఘాటిస్తుందన్నారు. సహజ జల వనరుల నుండి అదిక మొత్తములో చేపలు, రొయ్యలు పట్టడం, పర్యావరణ సవాళ్ళ కారణంగా సహజంగా లభించే మత్స్య ఉత్పత్తి తగ్గుతున్న వేళ, ఆక్వాకల్చర్ పెరుగుతున్న మాంసాహార డిమాండ్‌ను తీర్చడంలో ఆశాజ్యోతిగా నిలుస్తోందన్నారు. ఇది సుస్థిరంగా అధిక నాణ్యత గల ప్రోటీన్ అందించగల సామర్థ్యంతో, ప్రపంచ ఆహార భద్రతను కాపాడడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. సీఫుడ్ అత్యధిక పోషకాలు కలిగిన ప్రోటీన్ అందించగల ఉత్తమ వనరులలో ఒకటి అని, సీ ఫుడ్ ముఖ్యంగా చేపలు రొయ్యల వంటివి సులభంగా జీర్ణమయ్యే ముఖ్యమైన అమినో ఆమ్లాలు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, సెలీనియం, ఐయోడిన్, జింక్ వంటి సూక్ష్మ పోషకాలను కలిగి ఉంటాయన్నారు. ప్రపంచ జనాభా ఎనిమిది బిలియన్లకు పైగా పెరుగుతున్నప్పుడు, ఇటువంటి అధిక నాణ్యత గల ప్రోటీన్ కు డిమాండ్ పెరుగుతోందని, ఆక్వాకల్చర్ ఈ ప్రోటీన్ యొక్క లోటును తీర్చగల సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు.

# ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ



**ప్రజాశక్తి-మైలవరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన 17వ విడత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ రాము హాజరయ్యారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 నుంచి 2024 సంవత్సరం వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపపై ప్రజా వేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పనులుచేసిన కొందరి కూలీల సంతకాలు కానీ వేలు ముద్రలు కానీ హాజరు పట్టికలో తీసుకోపోవడం, కొలతలలో వ్యత్యాసాలు, మొక్కల పెంపకంలో భాగంగా వేసిన మొక్కలు సర్వైవల్ తక్కువగా ఉండటం, మస్తర్లు నందు కొట్టివేతలు ,దిద్ది బాట్లు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని పిడి రాము ఎఫ్ఎ ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టి ఏ లు, ఎఫ్ఏ లు ,మేట్ ల మధ్య సమన్వయం లోపించిందని అన్నారు.. గ్రామాలలో 18 సంవత్సరాలునిండి అర్హత కలిగి ఆసక్తి చూపిస్తున్న వారికి జాబ్ కార్డులు కల్పించాలని సూచించారు. విధుల పట్ల పూర్తి అవగాహన పెంచుకోవాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్తు ప్రసన్న రాణి , జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో పి అనురాధ , క్వాలిటీ కంట్రోల్ అధికారి నాగిరెడ్డి, అంబుడ్స్ మాన్ ఇమ్మానియేల్ రాజ్ , ఎస్ ఆర్ పి సూర్యనారాయణ, పిఆర్ఈ ఏఈ రమణమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నవీన్ కుమార్, ఏపీవో వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఓటర్ల జాబితా సవరణ



**ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు సుశీలదేవి తెలిపారు. రెడ్డిగూడెం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అర్హులైన వారు ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తి చేసి ఇవ్వాలన్నారు.

## 25 నుంచి సహకార సదస్సులు

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను ప్రకటించిందని దీనితో సహకార సంస్థ సదస్సు అన్ని ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు సహకార సంస్థల కూటమి ప్రతినిధి కె.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా న్యూ ఢిల్లీలో సదస్సు ప్రారంభమవుతుందని, తరువాత అన్ని ప్రాంతాలలో నిర్వహించనున్నారు అని తెలిపారు. ఇఫ్కో లిమిటెడ్, భారత సహకార మంత్రిత్వ శాఖ, అంతర్జాతీయ సహకార కూటమి సంయుక్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025పై స్మారక స్టాంప్ కూడా విడుదల చేయబడుతుందన్నారు. 'సహకార సంఘాలు అందరికీ శ్రేయస్సును అందిస్తాయి' అనే అంశంతో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ



**ప్రజాశక్తి-మైలవరం:** శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి (అమ్మ భగవాన్ సేవాసమితి) ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు దుప్పట్లు, టవల్సును పంపిణీ చేశారు. ఈ నెల 14న కృతజ్ఞతా భావం దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమితి సభ్యులు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** మండలంలోని అనుమంచిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు, రామచంద్రుని పేట, బలుసుపాడు, గరికపాడు, అన్నవరం గ్రామాల పరిధిలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని చిల్లకల్లు ఏఈ కె రమేష్ బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సురేష్‌కు పిహెచ్‌డి ప్రదానం



**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణానికి చెందిన వాగ్దేవి విద్యాసంస్థల అధినేత బుస సురేష్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి శుక్రవారం వృక్షశాస్త్రంలో చేసిన రీసెర్చ్ అండ్ పేపర్ ప్రజెంటేషన్‌తో పీహెచ్డీ డిగ్రీ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

## సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

**ప్రజాశక్తి-వత్సవాయి:** సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వత్సవాయి ఎస్సై ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని పోలంపల్లి గ్రామంలో సైబర్ నేరాలు, దొంగతనాల నివారణపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు గుర్తిస్తే వెంటనే పోలీసులను సంప్రదిచాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. **తిరువూరు:** సైబర్ నెరగాళ్ల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్యనారా యణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మహిళ పోలీసులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేస్తే వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దని తెలిపారు. బ్యాంకులు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటిపి, సివివి నంబర్లు, పాస్వర్డ్ అడిగితే ఎవరికి చెప్పకూడదని సూచించారు.



వత్సవాయిలో మాట్లాడుతున్న ఎస్ఐ



## అభివృద్ధి పనులపై గ్రామసభ

**ప్రజాశక్తి-తిరువూరు:** మండలంలోని ఆంజనేయపురం, మల్లెల, లక్ష్మీపురం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంబంధించిన గ్రామ సభలు జరిగాయి. గ్రామ సర్పంచ్ ల అధ్యక్షతన జరిగిన ఈసభల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పలు అభివద్ధి పనులకు సంబంధిం చిన అంచనాలు రూపొందించారు. ఆంజనేయపురం లో సర్పంచ్ మామిడి కుటుంబరావు అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించి 2025 - 26 సంవత్సరానికి పనులను అంచనాలను రూపొందించారు. ఈకార్యక్ర మంలో ఎంపీడీవో రవిబాబు, ఏపీవో నల్లగట్ల మున్ని, పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు, ఉపాధి హామీ కూలీలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## కరపత్రాలు పంపిణీ

**ప్రజాశక్తి-తిరువూరు:** ఈ నెల 26న తిరువూరు ఆర్‌డిఓ కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే ధర్నా కరపత్రాలను సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శుక్రవా రం విడుదల చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు కోరారు.

## ఒప్పో ఫైండ్ ఎక్స్-8 విడుదల

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్**

స్మార్ట్ ఫోన్ బ్రాండ్‌లలో అగ్రగామిగా ఉన్న ఒప్పో ఫైండ్ ఎక్స్8 సిరీస్‌ను విడుదల చేశామని ఒప్పో రీజినల్ ఇంఛార్జి కె . ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పో తన ఫైండ్ ఎక్స్8 సిరీస్ ఫ్లాగ్‌షిప్ మీడియాటెక్ డైమెన్సిటీ 9400 ఎస్ఓసీ, సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. రెండు టెలిఫోటో స్నాపర్‌లతో కూడిన పాత్ బ్రేకింగ్ క్వాడ్ కెమెరా సిస్టమ్, అధిక సాంద్రత కలిగిన వేగవంతమైన చార్జింగ్ సిలికాన్ కార్బైడ్ బ్యాటరీ ప్రత్యేకత అని తెలిపారు., కలర్ ఓఎస్ 15 ఫోటోగ్రఫీ, ప్రొడక్టివిటీ కోసం ఏఐ ఫీచర్‌ల హోస్ట్..ఉన్నాయని పేర్కొన్నారు. ఫైండ్ ఎక్స్8 సిరీస్ డిసెంబర్ 3 నుంచి ఒప్పో ఈ-స్టోర్, ఫ్లిప్కార్ట్, మెయిన్ లైన్ రిటైల్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# ఎంఎల్ఎ ఆదేశాలు బేఖాతర్

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పగలు ఎడ్లబండ్ల ద్వారా నిల్వ
- రాత్రికి ట్రాక్టర్లలో రవాణా



**ప్రజాశక్తి మోపిదేవి :** మోపిదేవి మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో యథేచ్ఛగా ఆక్రమ తవ్వకాలు కొనసాగుతున్నా మాకేంటి అన్నట్లు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న కృష్ణా నది తీర ప్రాంతాలు సిఆర్‌జెడ్ పరిధిలో ఉండగా నదిలో ఏ విధమైన ఇసుక, బుసక తవ్వకాలు చేపట్టరాదు అనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిటి ఇసుకాసురులు ఏమాత్రం పట్టించుకోకుండా ఇసుకను తోడేస్తున్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ స్వయంగా అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో కృష్ణానది సిఆర్‌జెడ్ పరిధిలో ఉందని ఏ విధమైన తవ్వకాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకోవాలని బహిరంగ సమావేశాలలో సైతం రెవిన్యూ ,పోలీస్ అధికారులకు సూచిస్తుండగా ఆయన ఆదేశాలను సైతం అధికార యంత్రం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.

మోపిదేవి మండలంలోని కే కొత్తపాలెం, నాగాయితిప్ప , కోసూరు వారి పాలెం ఉత్తర చిరువోలు లంక అడపావారిపాలెం గ్రామాలలో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. పగలు ఎద్దుల బండ్లలో తీసుకువచ్చి నిలవజేసి రాత్రి సమయంలో ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారుల దష్టికి తీసుకువెల్లగా ఇదిగో చర్యలు తీసుకుంటామంటూ దాటవేత దోరణి అవలంబిస్తున్నారే గాని కఠినమైన చర్యలు తీసుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రకతి వైపరీత్యాలకు తరచూ ఆయా గ్రామాలు నష్టపోతుండగా ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టి ఆయా గ్రామాలను రక్షించండి అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 26న మచిలీపట్నంలో జాబ్‌మేళా

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ – సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 26న మచిలీపట్నంలోని పోతేపల్లిలో గల ఇమిటేషన్ జ్యువెలరీ పార్క్ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో జాబ్‌మేళా నిర్వహించ నున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్, మచిలీపట్నం ఇమిటేషన్ జ్యువెలరీ పార్క్ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రెటరీ ఎ.జితేంద్ర కుమార్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో, విజేతా గోల్డ్ కవరింగ్స్ వర్క్స్, రవి ఇంజెక్షన్ మౌల్డింగ్ వర్క్స్, మెడ్ ప్లస్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు ఎనిమిదో తరగతి నుండీ టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, ఫార్మసి పూర్తిచేసిన 18 నుండి 40 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపిక అయిన వారికి నెలకు సుమారు రూ.8, వేలనుండి రూ.20,వేల వరకు వేతనముతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన సౌకర్యాల ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 99664 89796 నంబర్ను సంప్రదించాలన్నారు.

## బంటుమిల్లి ప్రాంత రైతాంగానికి ప్రత్యామ్నాయ పంటలు సూచించాలి

- సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై. నరసింహారావు

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** బంటుమిల్లి ప్రాంత రైతాంగానికి ప్రత్యామ్నాయంగా పంటలు సూచించి తగు సహాయం చేయాలని సిపిఎం కృష్ణాజిల్లా కమిటీ తరపున జిల్లా కార్యదర్శి వై నరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. బంటుమిల్లి ప్రాంతంలోని సముద్ర తీర భూములలో రెండవ పంట పండదు గనుక దాళ్వా సాగుకు అనుమతి ఇవ్వాలని గత కొద్దిరోజులుగా రైతంగం ఆందోళనలు చేస్తున్నారని గుర్తు చేశారు. అధిక వర్షాలు, వరదలతో మొదటి పంట దెబ్బతిని నష్టపోతున్నారన్నారు. నదులలో తగినంత నీరు లేనందున దాళ్వాకు నీరు ఇవ్వలేమని, ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని జిల్లా కలెక్టర్ శుక్రవారం ప్రకటించారని ఆరుతడి పంటగా మినుము పండనందున రైతాంగం దాళ్వాకి అనుమతి అడుగుతున్నారన్నారు. ఈ ప్రాంత భూముల స్వభావం, ఇక్కడి పరిస్థితులు గమనించకుండా దాళ్వాకి అనుమతి లేదని ప్రకటించడం సరైంది కాదన్నారు. కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఈ ప్రాంతంలో మినుము కాకుండా ప్రత్యామ్నాయ పంటలు ఏమి వేసుకోవచ్చో పరిశీలించి, సూచన చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమగు విత్తనాలు తదితర సహాయాలు చేయాలని, వీటి గురించి ఆలోచించకుండా అనుమతి లేదని ప్రకటి ప్రకటన చేసి ఊరుకోవడం సరికాదన్నారు. ప్రత్యామ్నాయ పంటలు సూచించి అందుకు తగు సహాయం చేయాలని సిపిఎం కష్ణా జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేశారు.

## సిపిఎం అభిమాని విజయభారతి మృతి



**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం లోని రామ్‌నగర్ కు చెందిన సిపిఎం అభిమాని కాసర్నేని విజయభారతి 84) శుక్రవారం మరణించారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కుమార్తె ఉన్నారు. సిపిఎం సిద్ధాంతాల పట్ల అత్యంత నమ్మకం కలిగి ఉండేవారు. పార్టీ ఉద్యమాల నిర్వహణకు అన్ని విధాలుగా సహకరించే వారు. ఆమె భర్త పార్టీ నాయకులుగా ఉన్న రోజుల్లో ఆయన అడుగుజాడల్లో నడిచారు. ఆమె పిల్లలు కూడా పార్టీ అభిమానులుగా కొనసాగుతున్నారు. సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల పార్టీ నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, గ్రామ పార్టీ నాయకులు మిరప నాగేశ్వరరావు, మాదిరెడ్డి చిన్నా, ప్రజాశక్తి సాంబశివరావు, దాదా తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలోని స్మశాన వాటికలో భారతి భౌతిక కాయానికి అంతిమక్రియలు నిర్వహించారు. ఆమె త్యాగాలను అనుమోలు కొనియాడారు.




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## ఫార్మసీ విద్యార్థులు ర్యాలీ

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** జాతీయ ఫార్మసీ వారోత్సవాలు పురస్కరించుకుని కృష్ణా విశ్వ విద్యాలయం ఫార్మసీ కళాశాల విద్యార్థులు శుక్రవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాలు సందర్భంగా ఫార్మసీ విద్యార్థులకు రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ర్యాలీనీ రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు ప్రారంభించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, మందుల వినియోగంపై శారదానగర్ లో ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఆచార్య మారుతి, సహా ఆచార్య సుజాత, సహాయ ఆచార్యులు శాంతి కపా, అమల, విష్ణు, హనుమంతరావు, శిరీష, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

## 'త్రివేణి' విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - గుడివాడ :** స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాల యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా త్రివేణి ఇంగ్లీసు మీడియం విద్యార్థులు 22మందికి వివిధ కేటగిరీల్లో 10 బహుమతులు సాధించారు. శుక్రవారం స్థానిక పాటిమిద గల త్రివేణి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విజేతలకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ప్రతి పోటీల్లో విజయం సాధించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది చిన్నారులు సైతం బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




త్రివేణి పాఠశాల విజేతలను అభినందిస్తున్న దృశ్యం

## కాజ్ వే పునర్నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** కృష్ణానది వరదల కారణంగా పాత ఎడ్లలంక కృష్ణా నది పాయ వద్ద కొట్టుకుపోయిన కాజ్వే పునర్నిర్మాణ పనులను ఎన్నారై బొబ్బా గోవర్ధన్ శుక్రవారం ప్రారంభించారు. కాజ్వే కొట్టుకుపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న గోవర్ధన్ గురువారం స్వయంగా వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే ఎక్స్ వెటర్ రప్పించి కాజ్వే పనులను టిడిపి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, యా సం చిట్టిబాబులతో కలిసి గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఏ కొద్దిపాటి వరద వచ్చిన కాజ్వే కొట్టుకుపోయి గ్రామస్తులు నెలలు తరబడి నది నీటిలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, దీని నివారణ కోసం వంతెన నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. వంతెన విషయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దష్టికి తీసుకువెళ్లానాని తెలిపారు. రాబోయే రెండేళ్లలో వంతెన కల సహకారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన గోవర్ధన్, అంతవరకు గ్రామస్తులు ఇబ్బంది పడకుండా సొంత ఖర్చులతో తాత్కాలిక కాజ్వే నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టిబాబు వెంకటేశ్వరరావు, కర్ర సుధాకర్, కన గాల సత్యం బాబు, కొల్లూరి వాసు, ఇమ్మానియేల్, మేడికొండ విజయ్, ఒడుగు రవి , మాజీ సర్పంచ్ పీత వెంకటేశ్వరరావు, చెక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.



కాజ్ వే పనులను ప్రారంభిస్తున్న బొబ్బా గోవర్ధన్

## ఎంఎస్ఎంఇ సర్వే సక్రమంగా నిర్వహించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్లో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సంబంధిత అధికారులతో జిల్లాలో ఎంపీడీవోలు, డి ఆర్ డి ఏ మెప్మా జిల్లా పరిషత్ అధికారులతో శుక్రవారం కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) సర్వే నిర్వహణపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహించాలని ఆదేశించిందన్నారు. దీని ఉద్దేశం పారిశ్రామిక వ్యాపార వర్తక వాణిజ్య ఏ యూనిట్ ఎక్కడుంది అనే సమాచారం సేకరించి ఎంఎస్ఎంఈ సర్వే కోసం ఇచ్చిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇందుకోసం గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది సేవలు వినియోగించుకోవాలన్నారు వర్తక వాణిజ్య వ్యాపార సంస్థలు అర్బన్ లో ఎక్కువగా రూరల్ లో తక్కువగా ఉంటాయన్నారు. కావున మచిలీపట్నం, వైఎస్ఆర్ తాడిగడప, గుడివాడ వంటి అర్బన్ ప్రాంతాల్లో అక్కడి సిబ్బందితో పాటు గ్రామీణ సచివాలయాల సిబ్బందిని కూడా ఈ సర్వే కోసం వినియోగించాలని ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. జనవరి లోపు ఈ సర్వే పూర్తి చేయాలన్నారు ఇది ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమం అన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వెంకట్రావు జూమ్ కాన్ఫరెన్స్లో పిపిటి ప్రజెంటేషన్ ద్వారా ఎమ్మెస్ ఎం ఇ సర్వే గురించి అవగాహన కల్పించారు.జిల్లా పరిషత్ సీఈవో కన్నమ నాయుడు జూమ్ కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

## కోడూరు-అవనిగడ్డ రోడ్డు నిర్మించాలి : సిపిఎం

**ప్రజాశక్తి- కోడూరు :** కోడూరు మండలం ప్రజలకు సంక్రాంతి కనుకగా కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిని యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. కోడూరులోని స్థానిక పేర్ల సుబ్బారావు స్టేడియం వద్ద శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో శీలం నారాయణరావు మాట్లాడుతూ అత్యవసరంగా హాస్పిటల్ కు విజయవాడ, గుంటూరు లాంటి సిటీలకు వెళ్లాలంటే కోడూరు మండల ప్రజలు గుంతల రోడ్డు ప్రయాణంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి ఈ రోడ్డు విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కోడూరు మండల కార్యదర్శి పోలబత్తిన మోహన్ రావు, కొప్పనాతి తాతయ్య, బత్తిన రాజగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శీలం నారాయణరావు

# న్యాయవాదులు విధులు బహిష్కరణ

**ప్రజాశక్తి-విజయవాడ:** విజయవాడ న్యాయస్థానం ప్రాంగణ ప్రవేశ ద్వారం వద్ద ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం శుక్ర వారం జరిగింది. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, విశాఖలో న్యాయ విద్యార్థినిపై, తమిళనాడులో న్యాయవాది హత్యను ఖండించాలని న్యాయవాదులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపర శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖలో న్యాయ విద్యార్థినిపై అమానుష అత్యాచారం చోటు చేసుకోవడం విచారకరమని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే తమిళనాడులో న్యాయవాది హత్యను ఖండిస్తున్నామని, ఈ సంఘటనలు అమానుషమని , నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే తీసుకు రావాలని, దాని కోసం తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐలు నగర అధ్యక్ష కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, రాజారత్నం, బిబిఎ సంయుక్త కార్యదర్శి క్రాంతి కుమార్, బొమ్మసాని రవి, కోటబాబు, నామాల కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట:** తమిళనాడులో సీనియర్ న్యాయవాది కన్నను అతి కిరాతకముగా నడిరోడ్డుపై దారుణంగా హత్య చేయడాన్ని, విశాఖపట్నంలో మహిళా లా విద్యార్థిపై గ్యాంగ్ రేప్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ నడిరోడ్డుపై హత్య చేసిన నిందితుడని, విశాఖపట్నంలోని విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిపిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అలాగే న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బత్తుల వెంకటరామయ్య, కరణం నరసింహారావు, పసుపులేటి సత్య శ్రీనివాసరావు,



విజయవాడలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయపూడి శ్రీనివాసరావు, జంగా నరసరాజు, కృష్ణయ్య, ఆంజనేయులు, కె శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, పూల నాగరాజు, దాసరి నాగేశ్వరావు, బి నరసింహారావు, బి బిక్ష్మయ్య, శ్రీధర్, అశోక్, శేషకుమారి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరువూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకదని లక్ష్మీనారాయణ, షేక్ గౌసుద్దీన్, న్యాయవాదు. లు బి ఎల్ గణేష్ సింగ్, మొగపర్తి సత్యం, చింతల వెంకటరెడ్డి, అత్తులూరి శ్రీనివాసరావు, నాగబండి రమేష్ బాబు, దారా మాధవరావు, గోగిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## డిసెంబర్లో ఫ్లవర్ ఎగ్జిబిషన్

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** డిసెంబర్ 21 నుండి 26వ తేదీ వరకు విజయవాడలో ఫ్లవర్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఎస్‌వీఆర్ ఈవెంట్ ఆర్గనైర్ గరిమెళ్ల జానకిరామయ్య తెలిపారు. దీనికి సంబంధించిన బ్రౌచేర్ ఆవిష్కరణ శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా జానకి రామయ్య మాట్లాడుతూ ఫ్లవర్ షోలో అనేక రాష్ట్రాల నుండి నర్సరీ వారు ఆర్గానిక్ (ప్రొడక్ట్, ఎరువులు ఫుడ్ ప్రొడక్ట్ తయారీదారులు, రైతులు వస్తారని అన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుండి రాత్రి 10 గంటల వరకు సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ మొఘల్రాజపురంలో ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. అందరూ ఈ ప్రదర్శనను. సందర్శించ వచ్చని తెలిపారు. ఈ ప్రదర్శనలో అతి అరుదైన రకరకాల, చామంతి మొక్కలను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు.

## తెలంగాణ మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి-వీరులపాడు:** మండల పరిధిలోని దొడ్డ దేవరపాడు గ్రామంలో కోసూరు పుల్లారావు అనే వ్యక్తి అక్రమంగా 11 తెలంగాణ మద్యం సీసాలు కలిగి ఉండడంతో కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అశ్రపునిసా బేగం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎవరైనా తెలంగాణ మద్యం తీసుకువచ్చి అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కుక్కల బెడదపై వినతి

**ప్రజాశక్తి-వత్సవాయి:** వత్సవాయి గ్రామంలో కుక్కల సమస్యను పరిష్కరించాలని పంచాయతీ ఇఒకు సిపిఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ వత్సవాయి గ్రామంలో సుమారు 15 వేల మంది ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. వివిధ గ్రామాల నుండి ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు ప్రజలు వచ్చి వెళుతుంటారని, ఈ సందర్భంలో స్కూలుకు వెళ్లే విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు కుక్కల బెడద వల్ల తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు , జి.వెంకటేశ్వర్లు, వై.వెంకటరత్నం, పి.వెంకయ్య, బి.పుల్లయ్య, కె.రతన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వీసాలలో జాప్యాన్ని నివారిస్తాం
### యుఎస్ కాన్సులేట్ జనరల్ రేబికా డ్రీమ్

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** అమెరికాకు సంబంధించి బి 1, బి 2 వీసాలలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని యుఎస్ కాన్సులేట్ జనరల్ రేబికా డ్రీమ్ అన్నారు. ఎఫ్ ట్రానిక్స్ నందు ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్వర్యంలో అమెరికా బిజినెస్, టూరిజం వీసా అనే అంశం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యు. ఎస్.కన్సులేట్ నిర్వహించే సేవలు, వీసా, ప్రాసెసింగ్ గురించి తెలిపారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియా, అతి పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికా మధ్య ఆర్థిక, సామాజిక సంబంధాలు బాగా అభివద్ధి చెందాయన్నారు. అమెరికా నుండి ఇండియాకు వచ్చే వారి సంఖ్య కూడా ప్రస్తుతం 300 శాతం అభివృద్ధి ఉన్నదని అన్నారు. హైదారాబాద్ కాన్స్యులేట్ కార్యాలయంలో గత ఏడాది నుండి సిబ్బంది పెంచామని త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. వీసా కోసం ఇచ్చే సమాచారం నిజాయితీ ఉండాలని అన్నారు. అత్యవసర సమయాలలో శాస్త్ర చికిత్స చేయించుకునేందుకు తక్కువ రోజుల్లోనే మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కాన్సల్ ఐశ్వర్య రావత్, ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ చుక్కపల్లి అవినాష్, ఎఫ్ ట్రానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ, ఉపాధ్యక్షులు దాసరి అన్వేష్, ఛాంబర్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి దేవిరెడ్డి పాల్గొన్నారు.




# కనీస వేతనం రూ.26 వేలివ్వండి
## మేయర్, డిఆర్ఒలకు మున్సిపల్ కార్మికుల వినతి



**ప్రజాశక్తి-విజయవాడ**: నగరపాలక సంస్థలోని వివిధ సెక్షన్లలో పని చేస్తున్న కార్మికుల కనీస వేతనాలు రూ. 26 వేలకు పెంచాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నేతలు కోరారు. ఈ మేరకు యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి ప్రవీణ్, ఇతర నాయకులు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిఆర్ఒ లక్ష్మీనరసింహంకు వేర్వేరుగా శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని కోరారు. ఇంజినీరింగ్, వాటర్ సెక్షన్, పార్కు, వీధిలైట్లు, వెహికల్ డిపో, మెకానిక్స్, టౌన్‌ప్లానింగ్ తదితర సెక్షన్లలో రెండు దశాబ్దాలకు పైగా పని చేస్తున్న కార్మికులు చాలీచాలనీ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు రూ. 15వేల నుండి 21 వేలు చేయాలని, అదేవిధంగా 18 500 ఉన్న ఇంజనీరింగ్ కార్మికులకు రూ.24,500 పెంచాలని కోరారు. అత్యవసర సర్వీసులైన వాటర్, పార్క్, స్ట్రీట్ లైట్, వెహికల్ డిపో మెకానిక్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ల విభాగాల్లోని కార్మికుల జీతాలను పెంచాలని కోరారు. లేనట్లయితే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ వాటర్ సెక్షన్ బాధ్యులు దుర్గారావు, పార్క్ సెక్షన్ బాధ్యులు టీ చిన్న, స్ట్రీట్ లైట్ సెక్షన్ సాంబ, రామారావు, వెహికల్ డిపో మెకానిక్ సెక్షన్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట**

తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి జొన్నలగడ్డ గ్రామానికి చెందిన కొండవీటి నికిత రూ.20,521 విరాళం అందజేశారు. దాతలకు ఆలయ సిబ్బంది ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు పూజలు నిర్వహించారు.

## నాటు సారా దుష్ఫలితాలపై అవగాహన

**ప్రజాశక్తి-రెడ్డిగూడెం**

నాటు సారా సేవిస్తే వచ్చే దుష్ఫలితాలపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమణ, ఎస్ఐ బి.మోహన్‌రావు, డాక్టర్ సందేశ్, ఎక్సైజ్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సారా సేవిచడం ఆరోగ్యానికి హానికరమన్నారు. చట్ట రీత్యా కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు.

# మాకు న్యాయం చేయండి
## దుర్గా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డిపాజిటర్ల ఆవేదన

**ప్రజాశక్తి-భవానీపురం:** తమకు న్యాయం చేయాలని దుర్గా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డిపాజిటర్లు కోరుతున్నారు. విద్యాధరపురం మర్రిచెట్టు సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం నిర్వాహకులు జింకా చక్రధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ది దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ డిపాజిటర్లు పాల్గొని తమ ఆవేదనను వెలిబుచ్చారు. పిల్లల వివాహానికి, ఇల్లు గడవటానికి దాచుకున్న డబ్బు తమ చేతికి అందకపోవటంతో వాపోయారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ పి.యస్. చరణ్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన దుర్గా కోపరేటివ్ బ్యాంక్‌కు రిజర్వు బ్యాంక్ లైసెన్సు రద్దు చేసిందన్నారు. అయితే ఈ నెల 16వ తేదీన బ్యాంక్‌కు లిక్విడేటర్‌ను నియమించిందన్నారు. లిక్విడేటర్ ద్వారా రూ.5 లక్షలు లోపు డిపాజిటర్లకు డబ్బులు ఇవ్వాలని రిజర్వు బ్యాంక్ ఆదేశించిందని, చాలాకాలంగా డిపాజిట్లు కోసం ఎదురుచూస్తున్న తమకు ఊరట కలిగిందని, అయితే బ్యాంక్ అధికారులు హైకోర్టులో కేసు వేయటంతో డిపాజిటర్లు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. సహకార శాఖ వారు రిజర్వు బ్యాంకు వారితో సంప్రదించి తక్షణమే డిపాజిట్‌దార్ల సొమ్ము చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, అందరికీ ఇన్సూరెన్స్ సొమ్ము ఇప్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

### రైల్వేలో రిటైరైన డబ్బులు డిపాజిట్ చేశా
**చిలకడపూడి శేషసాయి కుమార్**



రైల్వేలో పనిచేసి, రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బులు రూ. 20 లక్షలు దుర్గా కోపరేటివ్ బ్యాంక్‌లో డిపాజిట్ చేశాను. సంవత్సరాల తరబడి నమ్మకంగా నడుస్తున్నది కదాని ఈ బ్యాంక్‌లో డిపాజిట్ చేశా. ఇప్పుడు రిజర్వు బ్యాంక్ ఈ బ్యాంక్ లైసెన్సు రద్దు చేసింది. నా డబ్బులు నాకు ఇప్పించి న్యాయం చేయాలి.

### బ్యాంక్‌ను నమ్మి మునిగిపోయాం
**దుర్భాకుల గురునాథ ఘనాపాటి**



సంవత్సరాల చరిత్ర ఉన్న దుర్గా కోపరేటివ్ బ్యాంక్ మా పాలిట శాపంగా మారింది. బ్యాంకును నమ్ముకుని తాను రూ. 5 లక్షలు, నా భార్య పేరు మీద రూ. 5 లక్షలు డిపాజిట్ చేశాం. 30 ఏళ్ల నుంచి డిపాజిట్ బ్యాంక్‌లో ఉంది. మేము వృద్ధులం. బ్యాంకు నుంచి వచ్చే వడ్డీతో జీవితం గడిపేవారం. ఇప్పుడు చాలా ఆర్థిక ఇబ్బంది పడుతున్నాం. మా డబ్బులు మాకు ఇప్పించండి.

### న్యాయం చేయాలి : చరణ్



రిజర్వు బ్యాంక్ ఈనెల 12వ తేదీన దుర్గా కోపరేటివ్ బ్యాంక్ లైసెన్సు రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే లిక్విడేటర్ ద్వారా రూ. 5 లక్షల లోపు డిపాజిట్ దార్లకు డిపాజిట్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ దుర్గా కోపరేటివ్ బ్యాంక్ వారు హైకోర్టులో కేసు వేసినట్లు తెలిసింది. కేసును వెకేట్ చేసి మాకు న్యాయం చేయాలి.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రెసిడెంట్ చరణ్

### ఇబ్బందులకు గురిచేయడం తగదు : చక్రధర్



రూపాయి రూపాయి కూడబెట్టి ఇంటి అవసరాల నిమిత్తం, పిల్లల పెళ్లిళ్ళ నిమిత్తం దుర్గా కోపరేటివ్ బ్యాంక్‌లో డబ్బులు దాచుకున్న డిపాజిటర్లను ఇబ్బందులకు గురిచేయటం తగదు. ప్రభుత్వం, కోపరేటివ్ సెక్టార్ అధికారులు దీనిపై దృష్టిపెట్టి డిపాజిట్‌దార్లకు న్యాయం చేసి ఆదుకోవాలి.

## ఎమ్మెల్యేకు వినతి

తొలుత ఎమ్మెల్యే సుజనాచౌదరి లేబర్ కాలనీలోని జిఎన్‌ఆర్ పాఠశాలకు వస్తున్నారన్న సమాచారం అందుకున్న బ్యాంక్ బాధితులు బ్యానర్ చేతబట్టి పాఠశాలకు వద్దకు చేరుకున్నారు. కార్యక్రమం ముగించుకుని వెళ్తున్న ఎమ్మెల్యేను ఒక క్షణం తమ బాధను ఆలకించాలని కోరగా ఆయన కారు దిగకపోవటంతో సంబంధిత సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ పియస్ చరణ్ ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇంతకు ముందు ఉన్న ఎమ్మెల్యేను ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. రెండు నెలలు ఆగితే అందరికీ డబ్బులు ఇప్పిస్తానని వారికి చెప్పి ఎమ్మెల్యే వెళ్లిపోయారు.

# దాళ్వాకు సాగు నీరందించాలని నిరసన




తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి కాలువ కింద బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల పరిధిలో రెండవ పంటకు వరిసాగుకు నీరందించాలని రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం, అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ భరత్‌రెడ్డికు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా రబీలో సాగునీరు అందించకపోవడంతో ఇప్పటికే పొలాల చౌడు భూములుగా మారాయని, ఈ సంవత్సరం కూడా నీరు అందించకపోతే రైతాంగం నష్టపోవాల్సి వస్తుందన్నారు. రబీలో అపరాలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సూచిస్తున్నారని, శివారు మండలాలైన బంటుమిల్లి, కత్తివెన్ను మండలాలలో 90 శాతం భూములలో అపరాలు సాగుకు పనికిరావు అనే విషయం అందరికీ తెలుసని ఆయన అన్నారు. ఈ రెండు మండలాల్లో 6 లేదా 7 టీఎంసీల నీరు అందిస్తే రబీ సాగుకు సరిపోతుందని ఆయన సూచించారు. గతంలో నదులలో నీరు లేనప్పటికీ డెడ్ స్టోరేజ్ నుంచి నీరు అందించిన చరిత్ర ఉందని, ప్రస్తుతం డ్యాములలో సరిపడ నీరు ఉన్నప్పటికీ రబీ సాగుకు నీరు అందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి నీటి విడుదల పై పునరాలోచించి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అఖిలపక్షం రైతు సంఘం నాయకులు సుజ్ఞానం జనార్ధన్ రావు, ఎల్ అజయ్ ఘోష్, మాజేటి శ్రీనివాసరావు, పొదిలి వెంకటేశ్వరరావు, సుంకర నాగమల్లేశ్వరరావు, బి నాగరాజు, బివివి ప్రసాద్‌రావు, ఎన్ కష్ణ, జి బాబురావు, పి లవయ్య, జి నారాయణరావు, బి గంగాధర్‌రావు, సుంకర వెంకన్న, జి వెంకటనారాయణ పాల్గొన్నారు.

## బెల్టుషాపులను అరికట్టాలి : గౌతం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నూతన మద్యం పాలసీతో ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నా పట్టించుకోక పోవడం తగదని వైసీపీ అభిమాని బడే గౌతం అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు అనధికారకంగా నిర్వహిస్తూ అధిక ధరలకు మద్య విక్రయిస్తున్నారన్నారు. కోడూరు మండలంలో సాక్షాత్తు టిడిపి నాయకులే సోషల్ మీడియా వేదికగా ఎక్సైజ్ అధికారులు నిద్ర వస్తలో ఉన్నారని వారు నిద్ర వీడి మండలంలో బెల్ట్ షాపు లను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అదేవిధంగా నియోజక వర్గంలో అధికారుల పరిస్థితి ఏరకంగా ఉందో ఏరకమైన అవినీతి జరుగుతుందో కళ్ళకు కట్టినట్టు కనపడు తుందన్నారు. బెల్ట్ షాపులు అరికట్టవలసిన బాధ్యత ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌పై ఉందని, ఆయన అధికారులను ఆదేశించి బెల్ట్ షాపులను నియంత్రించేందుకు కృషి చేయాలని గౌతమ్ కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ కోరారు. శుక్రవారం ఉదయం చల్లపల్లి శివారు గంగులవారిపాలెంలో ప్రధాన రహదారికి ఇరువైపులా స్వచ్ఛ సుందర చల్లపల్లి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్, సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ టీ.పద్మావతి, స్వచ్ఛ కార్యకర్తలు, పద్మావతి హాస్పిటల్ సిబ్బంది, గంగులవారిపాలెం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ పర్యావరణహిత కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి-గన్నవరం :** తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గన్నవరం మండలం పురుషోత్తపట్నం సర్పంచ్ ఎం. రోహిణికి 104 సిబ్బంది శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి సకాలంలో జీతాలు అందించాలని కోరారు.104 కృష్ణాజిల్లా కోశాధికారి బి సుబ్బారావు (డ్రైవర్ ) ఉమా (డీఈఓ ) పాల్గొన్నారు.

## అన్నదానం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. లయన్ డాక్టర్ నర్రా గంగాధరరావు( వెస్ట్ ఇండీస్ ) పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక వితరణతో వందమందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ సభ్యులు పెరుమాళ్ళు, వైపీసీ ప్రసాద్, కె. బాపయ్య చౌదరి, పరంధామయ్య, పి. వెంకట్రావు, జే మోహనరావు, పి. రవీంద్ర, విజయ్ పాల్గొన్నారు.

## 26న ర్యాలీ, సభ కరపత్రాల పంపిణీ

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న జరిగే ర్యాలీ సభలన జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం మచిలీపట్నంలో కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షుడు టి చంద్రపాల్, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయ్ ఎండియూనస్ మచిలీపట్నం సిఐటియు కార్యదర్శి సిహెచ్ జయ రావు లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడులోని బస్టాండ్ వెనుక గల మండే పూడి నాగభూషణ రెడ్డి భవన్లో జరిగిన సమావేశంలో కంకిపాడు మండల రైతు సంఘం కార్యదర్శి శివశంకర్ మాట్లాడారు. రుణమాఫీ, పన్ను రాయితీ ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెడుతోందని అన్నారు. పది సంవత్సరాల నుంచి కనీస వేతనం ఏమాత్రం పెరగలేదు కానీ ధరలు మాత్రం రెట్టింపయ్యాయన్నారు. వీటిని అడ్డుకోవడానికి ఈనెల 26వ తేదీన జరిగే పోరాటంలో అందరూ కలసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి నరేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



బందరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



కంకిపాడులో మాట్లాడుతున్న శివశంకర్

## రాఘవయ్యకు పరామర్శ

**ప్రజాశక్తి-కంకిపాడు :** కల్లు గీత కార్మిక సంఘం పూర్వ కృష్ణా జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గా పనిచేసిన జంపాన రాఘవయ్యను కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో తన స్వగహంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు పరామర్శించారు.ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ 1980 ప్రాంతంలో కృష్ణా జిల్లాలో సంఘం అభివద్ధి కోసం, విస్తరణ కోసం మంచి కృషి చేశారని చెప్పారు. ఆయనతోపాటు రెడ్డయ్య కూడా పరామర్శించారు.



రాఘవయ్యను పరామర్శిస్తున్న రామచంద్రరావు

## రైతులకు సమీకృత దాణా పంపిణీ

**ప్రజాశక్తి-గన్నవరం :** బాపులపాడు మండలం అంపాపురం గ్రామంలో మండల పరిధిలో గల గ్రామాలకు టిఎంఆర్ సమీకృత దాణా శుక్రవారం డాక్టర్ దుర్గ భవాని పంపిణీ చేశారు. ఒక్క యూనిట్ 200 కేజీలు చొప్పున 50 యూనిట్లను మండల పరిధిలోగల గ్రామాలకు 200 కేజీలు 3.160 రూపాయలు ఖరీదు గల దాణాను రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా 1300 రూపాయలకు అందజేసినట్లు భవాని తెలిపారు. ఏహెచ్ఏ సామ్రాజ్యం పార్వతి పాడిరైతులు కోడేబోయిన బాబి సూర్రెడ్డిబెనర్జీ సుంకర రాజావేణుగోపాల్ సుంకర ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** గ్రామ అభివద్ధిలో దాతల భాగస్వామ్యం శుభపరిణామం అని స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ అన్నారు. చల్లపల్లి ఒకటో వార్డులో మన కోసం మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి దంపతుల భారీ విరాళం, గ్రామ పెద్దల విరాళాలు కలిపి హిందూ శ్మశానవాటిక పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శ్మశాన వాటిక నిర్మాణ పనుల కోసం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, వరదా రాంబాబు కుమారుడు - కోడలు వరదా వెంకట రామ లింగేశ్వరరావు-రాణి దంపతులు రూ.50 వేలు విరాళాన్ని అందచేశారు.

## భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - గుడివాడ :** విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిగతంగా జాగ్రత్తలు తీసుకోవాలని 1టౌన్ ఎస్ఐ గౌతమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బేతవోలులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, జాగ్రత్తలపై శక్తి టీం సభ్యులు గూడపాటి శిరిషా, నాగమణిలతో కలసి ఎస్ఐ గౌతమ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్‌ను శక్తి టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. ఫోన్‌లో వచ్చే పోస్టులను నమ్మవద్దన్నారు. విద్యార్థినిలు కూడా భద్రత విషయంలో జాగ్రత్తలు ఎంతో అవసరమన్నారు. ఉపాధ్యాయులు, యువ శక్తి కానిస్టేబుల్ సురేంద్ర, పాల్గొన్నారు.

## ఆర్‌బికె కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తాసిల్దార్ లోకరాజు మిల్లర్స్‌ను ఆదేశించారు. మండలంలోని కవుతరం, గుడ్లవల్లేరు లోని ఆర్ బికే కేంద్రాలు, రైస్ మిల్లులను శుక్రవారం పరిశీలించారు. ఆర్‌బికే కేంద్రాల అధికారులతో, రైస్ మిల్లర్స్‌తో తాసిల్దార్ మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేని కారణంగా రైతుల వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం చేయకుండా వెంటనే సేకరించాలని కోరారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివకుమార్ వీఆర్వోలు పాల్గొన్నారు.

## బాలలను సంరక్షించాలి




**ప్రజాశక్తి-పమిడిముక్కల :** నేటి తరం బాలలు రేపటి భావి పౌరులని వారిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రాజెక్టు అధికారి వి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలం లోని చోరగుడి ఉన్నత పాఠశాలలో దత్తత దినోత్సవ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి బాలల రక్షణ, బాల్య వివాహాలు నిషేధం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేరీ, స్థానిక ఏఎన్ఎం ధరణి, అంగన్వాడీ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## ఓటర్ల శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-నాగాయలంక :** ఈనెల 23,24 తేదీలలో ఓటర్ల జాబితా సవరణ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ హరినాథ్ బాబు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేయడానికి చిరునామా లేదా ఇతర చేర్పులు మార్పులు చేయడానికి బూత్ స్థాయి అధికారులు దరఖాస్తు పత్రాలు స్వీకరిస్తారన్నారు. అర్హతగల వారు ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు కూడా ప్రత్యేక కూడా శిబిరాలలో భాగస్వాములు కావాలన్నారు.

## తప్పుడు ప్రకటనలు చేయడం తగదు

**ప్రజాశక్తి-గన్నవరం :** కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై స్థానికంగా తప్పుడు ప్రకటనలు ఇస్తే సహించేది లేదని టీడీపీ నాయకులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు, నాయకులు బడుగు ఝాన్సీ ఇతరులతో కలిసి తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమా మాట్లాడుతూ గన్నవరం జడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి గెలిచిన మూడేళ్ల కాలంలో ఒక్క రోడ్డు నిర్మాణం, ప్రజాసమస్యను పరిష్కరించారా అని మండిపడ్డారు. అధికార అండదండలతో చేసిన అక్రమణలను సీఆర్డీఏ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కూల్చివేస్తే దానిని కక్ష సాధింపు చర్యగా అభివర్ణించడంపై తీవ్ర విమర్శలు చేశారు. గన్నవరం మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బోడపాటి రవికుమార్, రాష్ట్ర టి.యన్.టి.యూ.సి కార్యదర్శి బుస్సే నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** టిడిపి సభ్యత్వాల నమోదు కార్యక్రమానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన వస్తుందని గ్రామ టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కవుతరం గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ 360 నమోదయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 217బూత్ ఇంచార్జ్ నాగన్న , నమోదు సభ్యులు జానీ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ లోని ఏడవ వార్డులో టిడిపి సభ్యత్వ నమోదును ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కర్ర సుధాకర్, మేడికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

# నివాస ప్రాంతంలో మద్యం షాపు వద్దు



## గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

**ప్రజాశక్తి-మైలవరం:** గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు మైలవరం సర్కిల్ సిఐ దాడి చంద్ర శేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ తెలిపిన వివరాలు ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, మండలంలోని వెల్వడం గ్రామ శివారు కోతుల వాగు పై ఉన్న తూర్పు బ్రిడ్జి వద్ద గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి విజయవాడ సత్యనారాయణ పురం కు చెందిన దినవహి కష్ణవంశీ, నూజివీడుకు చెందిన పఠాన్ అసలం ఖాన్ లను అదుపులోకి తీసుకొని పరిశీలించగావారి వద్ద ఉన్న 0.250 కేజీల గంజాయి, ఒక స్కూటీ, ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని విచారించగా వీరిద్దరితో పాటు మరి కొంతమంది కలిసి మైలవరం పరిసర ప్రాంతాలలో రాత్రి వేళల్లో చిన్న చిన్న వస్తువులు దొంగిలిస్తూ ఏజెన్సీ ప్రాంతంలోకి వెళ్లి దొంగిలించినవస్తువులను ఇచ్చి గంజాయిని తీసుకొని మైలవరం విజయవాడ తదితర ప్రాంతాలలో చిన్న చిన్న పొట్లాలు కట్టి రూ.20 వేల నుండి 30 వేల వరకు విక్రయిస్తూవచ్చిన డబ్బుతో గంజాయి సేవిస్తూ, జల్సాలు చేస్తున్నట్లు తెలిపారు.మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని గంజాయి రవాణా చేస్తున్న మరికొందరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసులో ప్రతిభ చూపించిన ఎసిపి, సీఐ, ఎస్సై, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కే సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## యుటిఎఫ్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-మైలవరం:** ఈ నెల 24న విజయవాడలో జరిగే యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.తిరుపతిరావు, వాడపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కే గంగరాజు, వెల్వడం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కుక్కడపు శ్రీనివాసరావు, కార్యదర్శులు సూర్యనారాయణ, పి.భవానీ, మండల అధ్యక్షులు కట్టా రవిబాబు, ప్రధాన కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ఖరీఫ్‌లో జగ్గయ్యపేట సబ్ డివిజన్ పరిధిలో సుమారు 18 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు జగ్గయ్యపేట సహాయ వ్యవసాయ సంచాలకులు సి భవాని తెలిపారు. సుమారు 7,200 ఎకరాలలో సన్నధాన్యం రకాలు సాగు చేశారని పేర్కొన్నారు. జగ్గయ్యపేట సబ్ డివిజన్ పరిధిలో 24 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని, ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు 2,320 రూపాయలు, కామన్ రకాలకు 2,300 రూపాయలు ప్రభుత్వం మద్దతు ప్రకటించిందని చెప్పారు. ఇప్పటికే 52 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని మరో 64 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్డ్ ఇవ్వటం జరిగిందని తెలిపారు. గోనే సంచులు, హామాలి ఖర్చులు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతులు రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులందరూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు.

## కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద సిపిఎం ధర్నా

**ప్రజాశక్తి-విజయవాడ:** కృష్ణలంక సత్యంగారి హోటల్ రోడ్డులో నివాస ప్రాంతాల మధ్య మద్యం షాపును తక్షణమే తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో మద్యం షాపును ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలను తాగుబోతులుగా చేసి, అల్లర్లు, అశాంతికి దారితీసే విధంగా మద్యం షాపు ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడో గురునానక్ కాలనీలో పెట్టిన షాపుకు అక్కడి ప్రజలు అభ్యంతరాలు తెలిపారని కృష్ణలంకలో పెట్టడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో గతంలో మద్యం షాపులు పెట్టేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తే కమ్యూనిస్టులు, ఈ ప్రాంత ప్రజలు ప్రతిఘటించారని చెప్పారు. చుట్టూ విద్యాసంస్థలు, ఒక పక్క హైవే, మరో పక్క ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకైన, నాణ్యమైన మద్యం ఇవ్వడం కాదని, నాణ్యమైన బియ్యం, కరెంటు, సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి కోటేశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడుతూ గత వందేళ్ల చరిత్రలో కృష్ణలంకలోని ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు లేని వైన్ షాపును ఇప్పుడు ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. గతంలో మద్యం దుకాణాలు తెరవాలని ప్రయత్నాలు జరిగినా ఇక్కడి ప్రజలు పోరాడి తిప్పికొట్టారని అన్నారు. మద్యం షాపును తొలగించకపోతే స్థానిక ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, నాయకులు కోరాడ రమణ, వాజా శ్రీను, పి.శ్రీరాములు, గోపి, తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణం వద్దంటూ కృష్ణలంకలో షాపు బ్యానర్‌ను తగులబెడుతున్న సిపిఎం నాయకులు

## 26న కార్మిక, కర్షక ప్రదర్శనను జయప్రదం చేయండి

### సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** దేశవ్యాప్త రైతు, కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈ నెల 26న ఉదయం పది గంటలకు, పాత గవర్నమెంటు ఆసుపత్రి నుండి జరిగే రైతు, కార్మికుల ప్రదర్శనను జయప్రదం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ ముఠా కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపేట ఎంహెచ్ భవన్లో ముఠా వర్కర్స్ యూనియన్, విజయవాడ ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను హరించేసి, యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రైతులను భూముల నుండి గెంటేసి కార్పొరేట్ కంపెనీల వ్యవసాయానికి అనుకూలంగా విధానాలను రూపొందిస్తోందని ఆగ్రహ: వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చే అన్ని రకాల రాయితీలను రద్దు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మోడీకి అనుకూలంగా వ్యవహరిస్తుందని, ప్రస్తుతం కరెంటు స్మార్ట్ మీటర్లు బిగింపు, ట్రూ ఆప్ చార్జీల పేరుతో రూ.32 వేల కోట్ల భారాన్ని ప్రజల మీద మోపుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ముఠా సంఘం కార్యదర్శి సీతారాములు, యూనియన్ అధ్యక్షులు ఎం.బ్రహ్మయ్య, నాయకులు నారాయణ, చౌదరి, నరసింహులు, వెంకటరమణ, శ్రీను, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ పురోగతిలో మహిళల పాత్ర కీలకం

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** వంటింటి నుంచి వైజ్ఞానిక రంగం వరకు అన్నిచోట్లా మహిళలు సర్వోన్నతమైన అభివృద్ధిని సాధిస్తున్నారని, సమాజ పురోగతిలో మహిళల పాత్ర కీలకమని కెబిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు అన్నారు. కాలేజీ అనుబంధ యుజిసి ఉమెన్ స్టడీస్ సెంటర్ రూపొందించిన 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఇన్ ఇండియా - ఉమెన్ యాజ్ అర్కిటెక్ట్స్ అఫ్ ప్రోగ్రెస్' పుస్తకాన్ని శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధితో పాటు చాలాచోట్ల మహిళల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉందని, ఈ అవాంఛనీయ పరిస్థితులను అరికట్టడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మహిళా సాధికారతకు సంబంధించి వివిధ కోణాల్లో జరిపిన పరిశోధనను గ్రంథంగా తీసుకువచ్చిన యుజిసి స్టడీసెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఐక్యుఎసి కో- ఆర్డినేటర్ షమీమ్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.






## హై లైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** విజయవాడలోని హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం హై లైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఎగ్జిబిషన్ నీ ప్రముఖ నటి తేజస్వి మురివాడ ప్రారంభించారు. అనంతరం తేజస్వి మాట్లాడుతూ రానున్న పండుగలు, శుభకార్యాల సందర్భంగా ప్రత్యేకమైన ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అగ్రశ్రేణి ఆభరణాల బ్రాండ్ లను ఒకే చోటుకు తీసుకువచ్చి ప్రదర్శన ఏర్పాటు చేశామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 22 నుండి మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ ఉంటుందని అన్నారు.ఇందులో వజ్రాభరణాలు, టెంపుల్ జ్యువలరీ, బంగారు ఆభరణాలు, ప్లాటినమ్ ఆభరణాలు, ఫ్యూజన్ ఆభరణాలు, వివాహ ఆభరణాలు, పోల్కి జ్యువలరీ, ఎన్నో వేరైతీ ఆభరణాలు ఇక్కడ ప్రదర్శించనున్నారు అని తెలిపారు. హై లైఫ్ సంస్థ సీఈఓ డొమినిక్ మాట్లాడుతూ ఫ్యాషన్ బ్రాండ్ ఆభరణాల కోసం ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని అన్నారు.

## పారిశుధ్య పరికరాల కొనుగోలుకు తీర్మానం

**ప్రజాశక్తి-విజయవాడ**

నగర పరిధిలోని వరద ప్రభావిత రిజర్వాయర్‌ల వద్ద మూడు సర్కిల్స్ పరిధిలో మంచినీటి సరఫరాను పర్యవేక్షించడానికి, మంచినీరు వృధాను నివారించడానికి అవసరమైన పరికరాల కోసం రూ. 49.95 లక్షల జనరల్ ఫండ్ నుంచి కేటాయిస్తూ స్థాయి సంఘం తీర్మానించింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన శుక్రవారం స్థాయి సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం సభ్యులతో పాటు ఆయాశాఖలకు చెందిన అధికారులు పాల్గొని, అజెండాలోని 20 అంశాలపై చర్చించి, దాదాపుగా అన్ని అంశాలను ఆమోదించారు. గత సెప్టెంబర్‌లో చోటు చేసుకున్న బుడమేరు, కృష్ణానది వరద ప్రభావిత రిజర్వాయర్లలో దెబ్బతిన్న ఎల్ఒటి, ఎల్ఇడి, ఫ్లోమీటర్లు, ఛార్జర్లు, బ్యాటరీల స్థానంలో కొత్త వాటిని కొనుగోలు కోసం 2024-25 బడ్జెట్‌లోని వాటర్ సప్లై నిర్వహణ కోసం కేటాయించిన జనరల్ ఫండ్ నుంచి రూ.49.95 లక్షలు నిధుల ద్వారా పరికరాలను కొనుగోలు చేయాలని సమావేశం తీర్మానించింది. వర్క్స్ డివిజన్-3 ఇంజినీరింగ్ విభాగంలో గత ఏడాది జనవరి 29 నుంచి జులై 31 వరకు రూ. ఐదు లక్షల లోపు నామినేషన్ పద్ధతిలో ఆమోదం పొందిన 151 అత్యవసర పనులకు స్థాయి సంఘం ఆమోదం తెలుపుతూ తీర్మానించింది. నగర పరిధిలోని మూడు ప్రధాన కాలువలు (బందర్, ఏలూరు, రైవస్) కృష్ణానది జలాలు కులషితం కాకుండా, ఘన వ్యర్థాలు కలవకుండా ప్రధా అవుట్ ఫాల్ డ్రైయిన్లలో మల్టీ రేక్ మోటరైజ్డ్ స్టెయిన్‌లెస్ స్టీల్ మెకానికల్ కోర్స్ స్క్రీన్లు ఏర్పాటు చేయడానికి మెస్సర్స్ హైదరాబాద్‌కు చెందిన ఏరోటెక్ ఎన్విరాన్‌మెంటల్ ప్రయివేట్ లిమిటెడ్ వారి కొటేషన్ ఆధారంగా తయారు చేసిన రూ.28.44 లక్షల అంచనాల మొత్తాన్ని స్థాయి సంఘం ఆమోదిస్తూ నిర్ణయం చేసింది. వీటితో పాటు పలు అంశాలను సమావేశంలో తీర్మానించారు.

